ప్రజాశక్తి
శుక్రవారం 18 నవంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



రాష్ట్రస్థాయి పోటీలకు ఆశ్రమ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ధర్మలక్ష్మీపురం పాఠశాలలో జిల్లా స్థాయిలో పోటీల్లో ధర్మలక్ష్మీపురం పాఠశాలలో చదువుతున్న 12 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ఏడుగురు ఎంపికయ్యారు. వీరిలో బి.ప్రదీప్ (జావలిన్ త్రో, డిస్క్‌త్రో), ఎ.రంజిత్ (100,200 పరుగు), బి.రవి, బి.అజిత్ కుమార్ (కబడ్డీ), ఎ.అజయ్‌కుమార్, విజయ్‌కుమార్ (షటిల్), ఎం.వివేక్ (ఖోఖో) ఉన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.అక్కిన, వసతి గృహ సంరక్షణాధికారి ఎం.రాజేంద్రప్రసాద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఒకరి స్థలం మరొకరికి...

- ప్రజాప్రతినిధి అత్యుత్సాహం
- లబ్ధిదారులలో గందరగోళం
- అరకొరగా మౌలిక సౌకర్యాలు
- ముందుకు సాగని ఇళ్ల నిర్మాణాలు
- ఇదీ జగనన్న కాలనీల్లో పరిస్థితి



కారాడవలసలో తనకు కేటాయించిన ఇంటి స్థలంలో వేరొకరు నిర్మిస్తున్నారంటూ ఆవేదన చెందుతున్న లబ్ధిదారు శాంతి

ఒకరికి కేటాయించిన ఇంటి స్థలంలో మరొకర్ని ఇల్లు నిర్మించుకోమని ఓ ప్రజాప్రతినిధి సూచించడంతో లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. తమకు కేటాయించిన స్థలంలో మీరెలా ఇల్లు నిర్మిస్తారంటూ లబ్ధిదారులు ఘర్షణ పడుతున్నారు. మరికొన్ని చోట్ల జగనన్న లేఅవుట్లకు మౌలిక సౌకర్యాల్లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అరకొర సాయం ఎటూ చాలకపోవడంతో నిర్మాణ పనులకు ముందుకు రావడంలేదు. దీంతో నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణ పరిస్థితి మూడడుగుల ముందుకు... ఆరుడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి ప్రశ్నార్థకంగా మారింది.

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నియోజకవర్గానికి 11,783 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో సుమారు 8వేల ఇళ్లు పునాదుల స్థాయిలో ఉన్నాయి. ఇక పార్వతీపురం మండలానికి వస్తే 2,447 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 17లేఔట్లలో 1089 ఇళ్ల నిర్మాణం జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ కేవలం 96 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఇక పట్టణంలో 1,897 ఇళ్లకు గాను కేవలం 10 మాత్రమే పూర్తికాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో లబ్ధిదారులకు పెదమరికి, విశ్వంబరపురం, బాలగొడబ వంటి మారుమూల ప్రదేశాల్లో కనీస వసతులు లేని చోట ఇళ్లు కేటాయించారు. దీంతో అక్కడ కనీసం పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏ ఒక్క లబ్ధిదారుడు ముందుకు రాకపోవడంతో అధికారులు తలలు పటుకుంటున్నారు. ఎమ్మార్ నగర తదితర చోట్ల రూఫ్‌లెవల్ వరకూ నిర్మాణాలు పూర్తయినా బిల్లుల చెల్లింపులో జాప్యం ఏర్పడడంతో లబ్ధిదారులు మిగతా పనులకు ముందుకు రావడంలేదు. గోపాలపురం, కారాడవలస లేఔట్లలో నిర్మాణానికి ముందుకు రాని పట్టాదారుల స్థలాలను, దూరప్రాంతాల్లో కేటాయించన లబ్ధిదారులను ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు వచ్చారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధి ఖాళీ స్థలాల్లో కట్టుకోండి, తర్వాత అధికారులతో చెప్పి పట్టాలు మార్పిస్తానని చెప్పడంతో వారు పనులకు ఉపక్రమిస్తున్నారు. దీంతో అసలు పట్టాదారులతో తగాదాలు ఏర్పడి గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధికారులు వీరి తగవుల తీర్చలేక, పట్టాపొందిన వారికి సమాధానం చెప్పలేక సతమతమౌతున్నారు.



ఇంకా పునాదులు పడని పెదమరికి లేఔట్

వెంటాడుతున్న మౌలిక సదుపాయాల కొరత

పార్వతీపురం అర్బన్, రూరల్ లేఔట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి మౌలిక సదుపాయాల కొరత వేధిస్తుంది. ఎక్కడా కూడా కేటాయించిన ఇళ్లకు చేరుకోవడానికి సరైన రహదారులు లేవు. దీనికి తోడు విద్యుత్ కొరత తీవ్రంగా ఉంది. కారాడవలస, చినబొండపల్లి తదితర జగనన్న కాలనీలకు స్తంభాలు వేసినప్పటికీ తీగలు అమర్చకపోవడం, ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నారు. చినబొండపల్లి, గోపాలపురం తదితర లేఅవుట్లకు రోడ్డు సౌకర్యాం లేకపోవడంతో లబ్ధిదారులు తమ నిర్మాణ సామాగ్రిని తెచ్చుకోడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల బోర్లు వేసినా ట్యాంకులు నిర్మించకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి నీటి కొరత ఏర్పడుతుంది. ఇటువంటి నేపథ్యంలో వచ్చే డిసెంబర్ నాటికి గృహప్రవేశాలు అసాధ్యంగానే కనబడుతుంది.



మృతుడు గోవింద్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

ఏనుగుల దాడిలో మృతి చెందిన కుటుంబాలకు

రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - కొమరాడ

ఏనుగుల దాడిలో మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, అలాగే ఆటో ఇంట్లో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని, ఏనుగులను తక్షణమే అడవికైనా, జూకైనా తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఇటీవల ఏనుగుదాడిలో మృతి చెందిన మండలంలోని కళ్లికోటకు చెందిన దాసరి గోవిందు కుటుంబాన్ని గురువారం వేణుతో పాటు సిపిఎం నాయకులు బంటు దాసు, కొల్లి సాంబమూర్తి పరామర్శించారు. అనంతరం రెడ్డి వేణు విలేకరులతో మాట్లాడుతూ ఏనుగుల సమస్యపైన సిపిఎం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక పోరాటం చేసిందన్నారు. అలాగే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కూడా వచ్చి ఈ ప్రాంతాన్ని పర్యటించి ఇక్కడ రైతులు ఏనుగుల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించారన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ కూడా దుగ్గికళ్లికోట, గుణానుపురం గ్రామాల్లో పర్యటించిన సమయంలో ఏనుగుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, నేటికీ ఆ హామీలన్నీ నెరవేరని పరిస్థితి ఉందని అన్నారు. ఐదున్నరేళ్లుగా అటు ఒడిశా నుంచి శ్రీకాకుళం మీదుగా కురుపాం నియోజకవర్గానికి వచ్చిన ఏనుగులు వల్ల ఇప్పటికే 8మంది మరణించగా, సుమారు రూ.4 కోట్ల వరకు పంట, ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఇలాంటి సందర్భంలో అటవీశాఖ అధికారులు ఏనుగుల వెనకాల తిరగడమే తప్ప ఎలాంటి ఫలితం లేదన్నారు. రెండున్నరేళ్లుగా కొంతమంది రైతులకు రావాల్సిన పంట నష్టపరిహారం పూర్తిగా చెల్లించిన పరిస్థితి ఉందని, అలాగే మరణించిన 8 కుటుంబాలకు గాను ఇప్పటికీ రెండు మూడు కుటుంబాలకు ప్రకటించిన రూ.5లక్షలు కూడా ఇవ్వకుండా రూ.2.50లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునే పరిస్థితి ఉందని ఇది చాలా అన్యాయమని అన్నారు. ఏనుగుల దాడిలో చనిపోయిన కుటుంబానికి రూ.25లక్షల నష్టపరిహారం, ఇంటిలో ఒకరికి ఉద్యోగం, పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఏనుగులను అడవికి లేదా జూకు తరలించి ఈ ప్రాంత ప్రజల ప్రాణాలకు, పంటలకు భరోసా కల్పించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని నాయకులు హెచ్చరించారు.

మృతుడి కుటుంబానికి రూ.2.50 లక్షలు పరిహారం

జియ్యమ్మవలస : ఇటీవల ఏనుగుల దాడిలో మృతి చెందిన కొమరాడ మండలం కల్లికోటకు చెందిన దాసరి గోవింద్ కుటుంబానికి కురుపాం ఎమ్మెల్యే పాముల శ్రీవాణి పరిహారం అందజేశారు. గురువారం చినమేరంగిలో తన నివాస గృహంలో గోవింద్ కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద రూ.2.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఈ చెక్కు పంపిణీ కార్యక్రమంలో డిఎఫ్ఒ ప్రసూన, రేంజర్ రాజాబాబు, సెక్షన్ ఆఫీసర్లు అవతారం, సూర్య పాల్గొన్నారు.

పెదగెడ్డ నిర్వాసితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని కేసరి పంచాయతీ మడవలసలోని పెద్దగెడ్డ ప్రాజెక్టు నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకోవాలని డిప్యూటీ సిఎం రాజన్నదొరకు సిపిఎం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, రెడ్డి పారమ్మ, అడివమ్మా, సూకురు రామారావు, మాజీ ఎంపిటిసి గంగమ్మ వినతిని అందేశారు. మండలంలోని మడవలసలో గడగడపకు ప్రభుత్వం కార్యక్రమానికి గురువారం డిప్యూటీ సిఎం వచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్దగడ్డ రిజర్వాయర్ నిర్మించిన సందర్భంగా భూములు ఇల్లు సర్వం కోల్పోయిన తురైపాడు, మడవలస, రెండు గ్రామాల్లో ఉన్న 46 కుటుంబాలకు రెండు ఎకరాలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సాగుపట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. 2006లో సాగు పట్టాలిచ్చినా భూములు మాత్రం ఇవ్వలేదన్నారు. ఉమ్మడి జిల్లాగా ఉండేటప్పుడు విజయనగరం జిల్లా కలెక్టర్‌కు ఐటిడిఎ పిఒ, ఇతర ఉన్నదారులందరికీ వినతి పత్రాలు ఇచ్చామని, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళణ కూడా చేశామని అయినప్పటికీ భూములను రైతులకు చూపించలేదన్నారు. సరైవలస సమీపంలో ఒకసారి భూములు చూపించారని అక్కడ సాగు కోసం వెళితే గిరిజనులు తరిమివేసారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుండి అధికారులు కనీసం పట్టించుకోలేదని వినతిలో పేర్కొన్నారు. రేషన్ సరుకులను కూడా గిరిజనలకు సకాలంలో అందించడంలేదని రాజన్నదొర దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడుతానని చెప్పారు.

కేసలిలో గడపగడపకు...

మండలంలోని కేసలి, మడవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివద్ధి కార్యక్రమాలు వివరించారు ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అన్నారు. మడవలసలో 68 కుటుంబాలకు సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరిందని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య, ఇళ్ల స్థలాలు కేటాయించాలని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన రాజన్నదొర సంబంధిత అధికారులకు వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్మన్ కె.సింహాచలం, సర్పంచ్ ఎస్.నిర్మల, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, వైసిపి నాయకులు పి.వీరమనాయుడు, టి.గౌరీశ్వరరావు, డోల బాబ్జీ, ఇజ్జాడ అప్పలనాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంకు సిపిఎం వినతి




రాజన్నదొరకు వినతినిస్తున్న సిపిఎం నాయకులు ఈశ్వరరావు

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

- సోషల్ మీడియాకు బానిస కాకూడదు
- తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు తెలిపారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఐఆర్‌పిడబ్ల్యుఎ సంస్థ స్థానిక లయన్స్ క్లబ్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. 0 నుండి 18 ఏళ్ల గల బాలబాలికలు వారికి ఏమైనా సమస్యలు ఎదురైనా, వారి హక్కులకు భంగం కలిగినా కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు కుటుంబ విలువలు కూడా తెలియజేయాలన్నారు. విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకొని చదవాలని తెలిపారు. చదువుపై దృష్టి పెట్టాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, మత్తుపదార్థాలు, సెల్‌ఫోన్‌కు బానిసలు కావద్దన్నారు. ఇప్పుడు కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో ఎక్కువ సమయం గడిపాలన్నారు. వారితో మాట్లాడాలని, వారి నడవడికను పరిశీలిస్తూ ఉండాలన్నారు. బాలలకు రాజ్యాంగం కొన్ని హక్కులు కల్పించిందని వాటికి భంగం కలగకుండా, వారి జీవితాలకు భరోసా ఇచ్చేలా చూడాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మనూన్యతను వీడి ఎక్కడి నుంచి వచ్చామనే భావనను వదలి కలువపువ్వు వలె వికసించాలన్నారు. విద్యకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యమిస్తుందని అందుకే ప్రతి బాలబాలికను బడికి పంపించేలా ప్రోత్సహిస్తుందని అన్నారు. విద్యార్థులకు లక్ష్యం ఉండాలని, దాన్ని చేరుకొనేందుకుకష్టపడి ప్రణాళికా బద్ధంగా చదవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఆలిండియా పేరెంట్స్ కమిటీ సభ్యులు ఐ.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పీడీ జి.వరహాలు, డిడి వి.సూర్యనారాయణ, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, తదితరులు బాలల హక్కుల గురించి మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాల విద్యార్థినులు సాంస్కతిక కార్యక్రమాలు, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి మువ్వల సాగర్ అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయనం ప్రదర్శించారు. అనంతరం బాలల హక్కులపై పోస్టరును విడుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ బాపూజీ, ఎంఇఒ పివి ప్రసాద్, ఇతర అధికారులు, అనధికారులు, బాలబాలికలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ చైర్మన్ అప్పారావు, ఎమ్మెల్యే జోగారావు

చాగంటికి గురజాడ పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

2022 సంవత్సరానికి గాను గురజాడ విశిష్ట పురస్కారం చాగంటి కోటేశ్వరరావు ఇవ్వనున్నట్లు గురజాడ సాంస్కతిక సమైక్య అధ్యక్షులు పివి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. గురువారం మహాకవి గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఏటా నవంబరు 30న ఉదయం నుంచి రాత్రి వరకు 'గురజాడ సాహితీ చైతన్యోత్సవం' నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులను గురజాడ విశిష్ట పురస్కారంతో గౌరవించు కోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

ఇప్పటివరకు ఈ పురస్కారంతో జెవి సోమయాజులు, గొల్లపూడి మారుతీరావు, డాక్టర్ సి.నారాయణ రెడ్డి, కె.విశ్వనాథ్, గుమ్మడి, షావుకారు జానకి, మల్లెమాల, అంజలిదేవి, రావి కొండలరావు, వంశీ, భరణి, చాట్ల, మొదిలి నాగభూషణ శర్మ, సుద్దాల, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్, గరికపాటి నరశింహారావు, డాక్టర్ ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం, డైరెక్టర్ క్రిష్, గేయరచయిత రామజోగయ్యశాస్త్రి సత్కరించుకున్నామని తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఉత్తరాంధ్ర రచయితలకు నిర్వహించిన కవితల పోటీ విజేతల స్వీయ కవితా పఠనం, బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ గోపాలరావు, గురజాడ అప్పారావు మునిమనవడు ప్రసాద్, ఇందిరా, జక్కు రామకృష్ణ, చక్రవర్తి పాల్గొన్నారు.



చాగంటి కోటేశ్వరరావు

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కలెక్టరేట్

మానవాళికి పెనుముప్పుగా పొంచివున్న ప్లాస్టిక్ సంచుల నిషేధంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు, జగనన్న భూ హక్కు సర్వే నిర్వహణ, ఉపాధి హామీ పనులు, జగనన్న స్వచ్ఛ సంకల్పం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం పగడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ప్లాస్టిక్ సంచుల వాడకం నిర్మూలించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెంది సుస్థిరమైన ఆదాయం సాధించేలా తోడ్పాటును అందించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో లభించే అటవీ ఉత్పత్తులు మహిళా సంఘాల ద్వారా విక్రయించి ఆదాయ వనరులను పెంపొందించాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు శతశాతం పనులు గ్రౌండింగ్ జరగాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, డిఆర్ఒ జె.వెంకటరావు, డ్వామా పీడీ కె.రామ చంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎం.వి.ఆర్. కృష్ణాజీ, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇఇ ఒ.ప్రభాకర రావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ అధికారి ఆర్. రాజ్ కుమార్ పాల్గొన్నారు



విద్యార్థులను పాఠ్యాంశాలను అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ఏజెన్సీలో సబ్‌కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మైదాన ప్రాంతంలో గల బిసి, ఎస్‌సి విద్యా సంస్థల కంటే ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గురువారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఇప్పటి నుంచే కష్టపడి చదివి టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. గత ఏడాది సాధించిన పరీక్ష ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి సరఫరా, మరుగుదొడ్లు సరిగ్గా పనిచేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. కారివలస, మొరమా పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న భూమి రీసర్వే పరిశీలించారు. కారివలసలోని అంగన్వాడి కేంద్రం, ఎయిడెడ్ పాఠశాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార నిర్వహణ, పిల్లల ఎత్తు, బరువు పరిశీలించారు. చిన్నారులతో రాయించారు. ఆయన వెంట తహశీల్దార్ రాములమ్మ, అధికారులు ఉన్నారు.

డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మండలంలోని పెద్దింపేటలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథ రావు, ఆర్‌బిఎస్‌కె అధికారి డి.భాస్కరరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పనితీరుపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ స్థానిక వైద్య, ఆరోగ్య కేంద్రం పరిధిలోని 8 సచివాలయాలకు ఇద్దరు వైద్యులు, ఒక్కొక్కరికి నాలుగు సచివాలయాలు చొప్పున ఎఫ్‌పిసి ప్రోగ్రాంను నిర్వహిస్తుట్లు ఆయన తెలిపారు. విధి నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ, మందులు, రికార్డులు పరిశీలన తదితర అంశాలను వారు పరిశీలించారు. నెలలో రెండుసార్లు స్థానిక సచివాలయాల్లో 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఒపి నిర్వహిస్తూ మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు ఎఫ్‌పిసి పోగ్రాంను నిర్వహించాలని తెలిపారు. అనంతరం ప్రజలకు వివిధ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ వాటి నివారణకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు యు.మహిపాల్, కిరణ్మయి, సిహెచ్ఒ ఎస్‌వి రమణ, తదితరులు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ముమ్మరంగా వరికోతలు

- అధిక వర్షాలతో దోమపోటు
- దిగుబడిపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఖరీఫ్ వరి సాగు కోత దశకు చేరుకుంది. ప్రస్తుతం మండలంలో రైతులు ముమ్మరంగా వరిచేల కోతల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ ఏడాది వరి పంటలో దోమపోటు అధికంగా రావడంతో పంట దిగుబడి తగ్గే ఆస్కారం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే అధిక శాతం వర్షాలు కురవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు 20 బస్తాలైనా దిగుబడే వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది పండిన పంట కొనుగోలు సక్రమంగా లేక రైతులు ఎన్నో ఇబ్బందులు పడి నష్టపోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. ఈ ఏడాదైనా సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం కావాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దళారీల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వమే రైతు నుండి ధాన్యం సేకరించాలని రైతు భరోసా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో మిల్లర్ల దోపిడీతో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన రైతాంగాన్ని ఈ ఏడాదైనా ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



దబ్బగెడ్డలో వరికోతల్లో నిమగ్నమైన రైతులు

20న యుటిఎఫ్ రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి- సీతంపేట

గిరిజన విద్యారంగం సంక్షేమ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 20న పాడేరులో రాష్ట్ర సదస్సు జరుగుతుందని దానిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు అన్నారు. సీతంపేట గిరిజన బాలుర ఆశ్రమం పాఠశాలను సందర్శించి సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ అక్టోబర్ 17 నుండి 22వ తేదీ వరకు సమస్యలపై జీపు జాత నిర్వహించామని, ఈ జాతలో సేకరించిన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లడానికి ఈ సదస్సు నిరసిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు ఎంఇఒ ప్రమోషన్లు ఇవ్వాలని పండిట్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని మెస్ చార్జీలు పెంచాలని, జీవో నెంబర్3ని పునరుద్ధాటించాలని అనేక డిమాండ్లపై సదస్సు జరుగుతుందని చెప్పారు. ఈ సదస్సుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, సంక్షేమ శాఖ అధికారులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు హారిక భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు టీ చందరరావు, తదితరులు పాల్గొన్నారు.

బొన్నాడ కుటుంబీకులకు రాజన్నదొర ఓదార్పు

సాలూరు : ఇటీవల తమిళనాడులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బొన్నాడ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను గురువారం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఓదార్చారు. అక్కేన వీధిలో గల శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి ఆయన తండ్రి కృష్ణ, భార్యలను ఓదార్చారు. కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులను చూసి ఆయన చలించిపోయారు. శ్రీనివాసరావు చిన్న వయసులోనే సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో బాగా పేరు సాధించారని, ఆయన మృతి పట్టణ ప్రజలకు తీరని లోటని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ జి.నాగేశ్వరరావు, వెలంపేట నాయకులు కె.వెంకటరమణ, వైసిపి నాయకులు హరి బాలాజీ, మద్దిల గోవిందరావు పాల్గొన్నారు.

19 మెగా నేత్రవైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని చిట్టిపూడివలస గ్రామ జంక్షన్ వద్ద సత్యసాయి మందిరంలో ఈ నెల 19వ శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు విస్తరణకు కొలతలు

భామిని : రోడ్డు విస్తరణలో భాగంగా భామిని గ్రామ ప్రధాన రహదారికి కుడి, ఎడమ వైపు 35 అడుగులు మేర వెడల్పు ఉండేలా, రోడ్డు మొత్తం వెడల్పు 70 అడుగులు ఉండేటట్లు, భామిని సెంటర్‌లోని కోళ్ల ఫారం నుండి భామిని తహసీల్దార్ కార్యాలయం వరకు ఆర్ ఎండబి ఎఇ జగన్నాథరాజు, తహశీల్దార్ అప్పారావు ఆధ్వర్యంలో సర్వేయర్ టి. రాంమోహన్ కొలతలు నిర్వహించారు. ఆర్ అండ్‌బి అధికారులు సూచన మేరకు భవిష్యత్తులో వాహన రాకపోకలు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా, హెవీ వెహికల్స్ వెళ్లేలా, భామిని కూడలిలో రోడ్డు వెడల్పు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాంబాబు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో 'చైల్డ్‌లైన్‌కి దోస్తీ'

సీతంపేట : స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం చైల్డ్‌లైన్‌కి దోస్తీ కార్యక్రమంలో భాగంగా ఆర్ఫ్ చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు టి. చంద్రరావు మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణతో విద్య బోధన అందించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని అన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. చైల్డ్ లైన్ గురించి అవగాహన కల్పించారు. ఈ సంరక్షణలో ఎంతోమంది పిల్లలను సేవ్ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి జనార్దనమ్మ, ఉపాధ్యాయులు బాబురావు, సూరిబాబు, కమల, గౌరీష్, చైల్డ్ లైన్ బృందం డి. రాణి కృష్ణారావు, లక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

భామిని : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి తోట శాంతి కుమారి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పాలకొండ : పాలకొండ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్-కో ఇఇ టిజికె మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెంటినెన్స్ పనులు చేయనున్నందున ఈ అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

పనుల పరిశీలన

సీతంపేట : మండలంలోని కారిగూడ, పెద్దూరు సచివాలయ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న టెర్రసింగ్ పనులను ఎంపిడిఒ కె.గీతాంజలి పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూ పిసి నిర్మించడానికి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సాగర్, ఉపాధి సిబ్బంది తదితరులు ఉన్నారు.

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని బందంవారి వీధిలో కుళాయి పైన్‌లైన్ల కోసం తవ్విన రోడ్లను అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. 'ప్రజాశక్తి'లో ఈనెల 10న ప్రచురితమైన 'తవ్వేస్తున్నారు... వదిలేస్తున్నారు...' అన్న వార్తకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. ఈ మేరకు కుళాయి కనెక్షన్లు సంబంధించిన యజమాని తాగునీటి పైపులైన్ వేసేందుకు తవ్విన రహదారి ప్రాంతంలో రహదారిలో మరమ్మతులు చేయడంతో ఆ దారిన రాకపోకలు సాగిస్తున్న స్థానికులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే

సీతానగరం : మండలంలోని పెదంకలాం, సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు రాధా క్రాంతి, శిరీష ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి గుర్తింపుపై ఇంటింటా సర్వేను ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సర్వేలో కుటుంబంలో ఎవరికైనా మచ్చలు ఉంటే పరిశీలించి అనంతరం వారిని ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని చూసించారు. ఈ వ్యాధి నిర్మూలనకు అంతా సహకరించాలని కోరారు. ఈ సర్వే డిసెంబరు 5 వరకు కొనసాగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వి ఎల్.సత్యవతి, వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదబుడ్డిడిలో నేడు గడపగడపకు..

జియ్యమ్మవలస : మండలంలోని పెదబుడ్డిడిలో గడపగడపకు మన ప్రభుత్వం శుక్రవారం నిర్వహించనన్నట్టు సర్పంచ్ సీమల సుజాత, వైసిపి నాయకులు బాబు భువన మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి పాల్గొంటారని అన్నారు. పెద్ద ఎత్తున నాయకులు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఆర్‌బికెల్లో ధాన్యం సంచులు సిద్ధం

పార్వతీపురం రూరల్ : మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల్లోనూ ధాన్యం కొనుగోలు నిమిత్తం సంచులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఆర్.రేఖ తెలిపారు. గురువారం పెద్ద బొండపల్లి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు అతి త్వరలోనే ప్రారంభిస్తామని, అందుకు ఒక్కో ఆర్‌బికె వద్ద కనీసం 5వేల సంచులు ఉండేలా చర్యలు చేపడుతున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సవరపు తౌడమ్మ, నాయకులు రాజారావు, చందాన శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన

జియ్యమ్మవలస : మండలంలో తుంబలి పంచాయతీ గంగమ్మపేటలో అంగన్వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం స్థానిక జెడ్‌పిటిసి ఎం.శశికళ భూమి పూజ చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో గ్రామానికి మంజూరైన భవనం నిర్మాణం జరుగుతుందన్నారు. సొంత భవనం లేక అద్దె కొంపలోల కేంద్రం నిర్వహణ వల్ల పిల్లలు అవస్థలు పడుతుంటారని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీశంకర్రావు, డిసిసిబి డైరెక్టర్ లొలుగు నారాయణరావు పాల్గొన్నారు.



సాగు లేని భూమి కాదు.. సాగరమే.!

మీరు చూస్తున్న ఈ చిత్రం ఏమైదామో, లేక సాగు లేని బీడు భూమో అనుకుంటే పొరపడినట్లే... ఎందుకంటే ఇది మండల కేంద్రమైన మక్కువ ప్రధాని రహదారికి ఆనుకొని ఉన్న బైరిసాగరం. ఈ చెరువు నీటిని నాచుతోనూ తామరతోనూ కప్పివేశాయి. స్థానికుల ఇది చెరువు అని తెలుస్తుంది. బయటి వారికి ఎవరికైనా ఈ పరిస్థితి చూస్తే చెరువు కాదేమో అని ఏమరపాటున పడే ఆస్కారం లేకపోలేదు. -ప్రజాశక్తి, మక్కువ.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన భాండాగారాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక డివిఎం ప్రభుత్వ మున్సిపల్ స్కూల్‌లో రాష్ట్ర గ్రంథాలయ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి గొప్ప స్థాయికి వెళ్లారని అన్నారు. మనలో ఆలోచన మొదలైతే పని పూర్తవుతుందని, పని చేసుకుంటే అలవాటవుతుందని, ఆ అలవాటే మన వ్యక్తిత్వమవుతుందని అన్నారు. వ్యక్తిత్వం మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని వివరించారు. విద్యార్థులు ప్రతి రోజూ పేపర్ చదవడం వల్ల మేధస్సు మెరుగుపడుతుందన్నారు. చదవడం వల్ల మానసికోల్లాసంతో పాటు విషయ పరిజ్ఞానం కూడా పెరుగుతుందన్నారు. పేదరికం చదువుకు అడ్డుకాదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆత్మవిశ్వాసంతో చదువుకోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని, వాటిని చేరుకోవడానికి కష్టపడాలన్నారు. సెల్‌ఫోన్లపై దృష్టి తగ్గించి, పుస్తకాలపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు కె.శివకేశవరావు మాట్లాడుతూ ప్రజా గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకుంటే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన బెలగాం భీమేశ్వరరావు, నారంశెట్టి ఉమామహేశ్వర రావులను సత్కరించారు. కార్యక్రమంలో డిపిఆర్‌ఒ ఎల్.రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, జిల్లా గ్రంథాలయ సంఘం కార్యదర్శి చొక్కాపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం : మాట్లాడుతున్న డిఇఒ ఎస్‌డివి రమణ

పాలకొండ రూరల్: 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం 6, 7, 8 తరగతుల విద్యార్థులకు గ్రంథాలయ అవశ్యకతపై స్థానిక పెదకాపు వీధి హైస్కూల్‌లో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు 70మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. స్థానిక పాఠశాల విద్యార్థులతో పాటు జిల్లా పరిషత్ బాలికోన్నత, మండల పరిషత్ ప్రాథమికోన్నత, ఆర్ సిఎం ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు జామి రవి, గొలివి తిరుపతిరావు, బౌరోతు మల్లేశ్వరరావు, కొంగరాపు గడ్డయ్య, భారతి, కోట నారాయణరావు, ఎలమంచిలి మల్లేశ్వరరావు, మరిచర్ల గౌరమ్మ, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

సీతంపేట: 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలను 6,7,8 తరగతి పిల్లలకు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 39 మంది విద్యార్థులు పాల్గొని తలబడ్డారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు హేమ సుందరరావు ఉపాధ్యాయులు, గౌరిష్, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా గురువారం విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఎం. వెంకటేశ్వరరావు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలకు ప్రగతి మహర్షి జిల్లా పరిషత్ పాఠశాలకు నుండి 46 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు స్వాతి తదితరులు పాల్గొన్నారు.


సీతానగరం : జాతీయ గ్రంథాల వారోత్సవాలు సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కవితలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పైడ్రాజు మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లోనే పాల్గొంటే తమ సామర్థ్యాన్ని తెలుసుకొని పెంపొందించే ఉపయోగపడుతుందన్నారు.

పంటలతో ఆర్థికాభివృద్ధి

జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతులు తమకున్న విస్తీర్ణంలో ఏడాది పొడవునా పంటలు పండించుకోవడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు కుటుంబ ఆహార భద్రత సాధించడం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ అన్నారు. గరుగుబిల్లి మండలం తోటపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద జట్టు వ్యవస్థాపకులు డి. పారినాయుడు ఆధ్వర్యంలో రైతులకు రబీలో నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. భూమిని పలు పంటలతో కప్పి ఉంచడం వల్ల పురుగులు తెగుళ్లను నివారించవచ్చు అన్నారు. భూమిలో కార్బన్ శాతం పెంచడానికి వీలుంటుందన్నారు. ఖరీఫ్‌లో వరి పంట కోసే వారం రోజులు ముందు రబీ డ్రై సోయింగ్ విత్తనాలు వేయడం వల్ల పంటలలో జీవ వైవిధ్యం సాధించడం జరుగుతుందన్నారు. జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సలహాలు, సూచనలు నమూనాలను వివరించడానికి కార్యకర్తలు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రభుత్వం కూడా రైతులకు అన్ని విధాలుగా వ్యవసాయ రంగంపై శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందించడం జరుగుతుందన్నారు. రైతులు మార్కెట్లో అధిక ధరలో నీటి తడులు తక్కువగా ఉన్న పంటలు, ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. వరి విస్తీర్ణం తగ్గించి పెసలు, మినుములు, రాగులు, కందులు, ఉలవలు మొదలగు అపరాలు, చిరుధాన్యాలు పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రబంధకలు పి. షణ్ముఖ రాజు, ఎడిఎ నిర్మలజ్యోతి, ఎఒ విజయభారతి, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ ప్రహరాజు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న రాబర్ట్ పాల్

ఆక్రమణలపై సబ్‌కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగి గ్రామంలో సర్వే నెంబర్ 189లో 1.20 ఎకరాల విస్తీర్ణం ఉన్న కోనేరు చెరువును కొంతమంది ఆక్రమణదారులు కబ్జా చేసేందుకు జెసిబితో పనులు చేపట్టారు. ఈ విషయంపై అదే గ్రామానికి చెందిన కొంతమంది గురువారం పాలకొండ సబ్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో విషయాన్ని కార్యాల సిబ్బంది అతనకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. గుమ్మలక్ష్మీపురం పర్యటలో ఉన్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్ తెట్టంగి గ్రామాన్ని చేరుకొని ఆక్రమణ గురైన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమాలకు గురైన చెరువు గర్భాన్ని ముందుగా ఏ విధంగా ఉందో అదే విధంగా చేయాలని, వీటికి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయాలని విఆర్‌ఒకు ఆదేశించారు.

రోడ్డుపై చెత్త వేస్తే అపరాదరుసుం విధిస్తాం

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో వ్యాపారులు రోడ్డుపై చెత్త వేస్తే అపరాద రుసుం విధిస్తామని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. గురువారం నగర పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని రకాల వర్తక వ్యాపారులతో పారిశుధ్యంపై నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి షాపు ముందు చెత్త బుట్ట పెట్టుకొని చెత్త బుట్టలో మాత్రమే చెత్తను వేయాలని లేకుంటే అపరాద రుసుం విధిస్తామని అన్నారు. అనంతరం వ్యాపారస్తుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సచివాలయ శానిటరీ కార్యదర్శులు, నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



చెరువు వివరాలను అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

అమరుల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -మక్కువ

గిరిజన పోరాటాల్లో అమరులైన వారి సేవలు మరువలేనివని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు అన్నారు. పోరాట అమరుడు జన్ని తిరుపతి 23వ వర్థంతి సభ దుగ్గేరులో గురువారం జరిగింది. తొలుత సంఘ కార్యాలయం నుంచి గిరిజన పేట మీదుగా మార్కెట్ యార్డ్ వరకూ ర్యాలీ జరిగింది. ర్యాలీ అనంతరం జిల్లా అధ్యక్షులు యు.ముత్యాలు అధ్యక్షతన సభ నిర్వహించారు. అనంతరం ఎంతటి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డి.వర్మ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సంఘం 1991లో ఏర్పడిందని, ఈ సంఘం కృషి ఫలితంగా ఇక్కడ ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడమని, పాలేరుల సంఘం ఏర్పాటు చేసి పాలేరులకు తినడానికి వేడి అన్నం పెట్టాలని, జీతాలు పెంచాలని, జబ్బు చేస్తే వైద్యం అందించాలని మొదలగు డిమాండ్లతో పోరాడమని అన్నారు. ఎన్నో భూ పోరాటాలు నిర్వహించి, ఒప్పందాల ద్వారా తక్కువ రేటుకే భూమిలేని గిరిజన రైతాంగానికి భూమిని అప్పజెప్పామని అన్నారు. ఈ పోరాటాల్లో భాగంగానే సంఘంపై 1999లో భూస్వాములు దాడికి పాల్పడినప్పుడు కామ్రేడ్ జన్ని తిరుపతి అమరుడయ్యాడని ఆయన స్ఫూర్తితో మనం మన పోరాటాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో నవ యువ సమాఖ్య రాష్ట్ర నాయకులు ఎస్‌కె భాషా, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.భాస్కరరావు, పి.శ్రీరాములు నాయుడు, పి.అసిరి, సింహాద్రి నాయుడు, పలు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

పెద్దబోగిలిలో ఫ్యామిలీ ఫిజీషియన్

సీతానగరం : మండలంలోని పెద్ద బోగిలి గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పిహెచ్‌సి వైద్యాధికారి ఉషారాణి, 104 డాక్టర్ వంశీబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయో వృద్ధులు అందరికీ బిపి, షుగర్, హీమోగ్లోబిన్ టెస్టులు చేసి కావాల్సిన వారికి మందులు పంపిణీ చేశామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 104 సీనియర్ వైద్యులు గుడివాడ ప్రభాకర్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలక దేవానంద్, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

ఏనుగుల తరలింపు ఎప్పుడు?

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఏనుగుల తరలింపునకు చర్యలు ఎప్పుడు చేపడతారని జనసేన నాయకులు జిల్లా అటవీశాఖ అధికారిని ప్రశ్నించారు. గురువారం జనసేన నాయకులు డిఎఫ్ఒ ప్రసూనను కలిసి ఏనుగుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా ఏనుగులు కొమరాడ, పార్వతీపురం, కురుపాం, జిఎం వలస, గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట తదితర మండలాల్లో సంచరిస్తూ ఇప్పటివరకు 8మందిని పొట్టను పెట్టుకున్నాయన్నారు. అలాగే 30వరకు పశువులను మట్టుపెట్టాయన్నారు. కోట్లాది రూపాయల ఆస్తి, పంట నష్టం జరిగిందన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం కానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయం అన్నారు. ఏనుగులు తరలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలన్నారు. తక్షణమే ఏనుగులను తరలించేలా చర్యలు చేపట్టాలని, నష్టపోయిన బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని అన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ఆమెకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, దాలినాయుడు, రాంబాబు, శిరీష్, గౌరీ శంకర్, మానేపల్లి ప్రవీణ్ తదితరులు ఉన్నారు..

సిఐటియు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

సాలూరురూరల్ : డిసెంబర్ 4,5 తేదీల్లో పార్వతీపురంలో సిఐటియు జిల్లామహాసభల వాల్‌పోస్టర్‌ను మండలంలోని మరిపల్లిలోని గంగన్నదొరవలస కూడలిలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్‌వై నాయుడు గురువారం ఆవిష్కరించారు. ఈ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొంటున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్‌లో కార్మికులను పోరాటాలకు సన్నద్ధం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు నారాయణమ్మ, లక్ష్మి, పుష్ప, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు జంతు సంక్షేమ కమిటీ సమావేశం

పాలకొండ రూరల్ : స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 12 గంటలకు డివిజనల్ స్థాయి జంతు సంక్షేమ కమిటీ సమావేశం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అధ్యక్షతన జరుగుతుందని పశుసంవర్ధక శాఖ ఏడి మాణిక్యాలరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. కావున అందుబాటులో బాటులో ఉన్న జంతు సంక్షేమ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రఘురాం అన్నారు. మండలంలోని జానుమూలవలసలో జగనన్న కాలనీ లేఅవుట్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి హౌసింగ్ నుంచి ఎటువంటి పెండింగ్ లేకుండా బిల్లులు చెల్లిస్తామన్నారు. అలాగే నిర్మాణానికి కావాల్సిన సామాగ్రిని అందిస్తామన్నారు.

దీంతో లబ్ధిదారులు ప్రస్తుతానికి వరి కోతలు ముమ్మరంగా ఉండడంతో కొంత మేరకు ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందిగా ఉందని సమాధానం ఇచ్చారు. పీడీ వెంట హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకీరాం, వర్క్ఇన్‌స్పెక్టర్ పి.కృష్ణ, గ్రామ సర్పంచి ఏళ్ల అప్పలనాయుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొత్త రుణాలు రూ.6 కోట్లు

ప్రజాశక్తి - సాలూరు రూరల్

మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాల్లోని మహిళా సంఘాల సభ్యులకు రూ.6కోట్లు కొత్త రుణాలు అందజేస్తామని డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యంనాయుడు అన్నారు. గురువారం స్థానిక వెలుగు సమాఖ్య భవనంలో సమావేశంలో సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల ఎపిఎంలు, సిసిల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గతంలో స్త్రీనిధి ద్వారా తీసుకున్న అప్పులను నూటికి నూరుశాతం వసూలు చేయాలన్నారు.

కొత్తగా మూడు మండలాల పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు రూ.6కోట్లు రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ఈ ఏడాది ఒన్ దన్ కేంద్రాల ద్వారా పసుపు, చింతపండు, కొండచీపుర్లు ను కొనుగోలు చేసేందుకు సిబ్బంది ప్రణాళికలు తయారు చేసుకోవాలని కోరారు. ఎపిఎంలు జి.సింహాచలం, సన్నినాబు, స్త్రీనిధి అధికారి జయకుమార్, సిసిలు రామకృష్ణ, సుమతి పాల్గొన్నారు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఇందిరా డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో గురువారం మండల మహాసభ నిర్వహించారు. ఈసభలో ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లు రాత్రీ పగలన్న తేడా లేకుండా తమ విధులను నిర్వహిస్తున్నా ప్రభుత్వం కనీస వేతనం చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పెరుగుతున్న ఖర్చులతో సకాలంలో వేతనాలందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 4,5 తేదీల్లో పార్వతీపురంలో జరగబోయే సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తాడికొండ,రేగిడి, దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పని చేస్తున్నా ఆశా వర్కర్ల పాల్గొన్నారు.



మహా సభలో మాట్లాడుతున్న ఇందిర

పేదలకు ఉచిత వైద్యశిబిరాలు

కలెక్టరేట్ : పట్టణంలోని శ్రీసాయిరాం డయోగ్నటిక్ సెంటర్ డాక్టర్ వై జోస్‌రాణి, డాక్టర్ పి. రాజేంద్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల్లోనూ, డయోగ్నస్టిక్ సెంటర్ వద్ద ఇప్పటికే ఆరుసార్లు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగానే అందజేస్తున్నారు. ఇప్పటికే చిన్న బొండపల్లి, కుమ్మరిగుంట, వైకెఎం కాలనీలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. రోగులకు రక్తం, సీరం, మూత్ర, హార్మోన్ వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను ఉచితంగా అందజేశారు. ప్రతి మెడికల్ క్యాంపులో సుమారు 300 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత మందులు సరఫరా చేస్తున్నారు. రానున్న రోజుల్లో రోజుల్లో మరికొన్ని గ్రామాల్లో ఉచిత మెగా క్యాంపులో నిర్వహించనున్నట్టు డయాగ్నస్టిక్ సెంటర్ యాజమాన్యం ప్రతినిధులు వై.వాసుదేవరావు, రామినాయుడు, ఎ.భాస్కరరావు తెలిపారు.



వైద్య సేవల కోసం క్యూ కట్టిన పేదలు

5న పాస్టర్ల సమావేశం

సాలూరు : సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన పాస్టర్ల సమావేశం ఈనెల 5న వెలగవలసలో నిర్వహిస్తున్నట్లు మండల గిరిజన పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు జి.సూర్యనారాయణ సువార్తరావు చెప్పారు. గురువారం బట్టివలసలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు ఎం.తిమోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇమామ్, పూజారులతోపాటు పాస్టర్లకు రూ.ఐదువేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. దీనికోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో ఈనెల 5న జరిగే సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు వైఎస్ థామస్ రెడ్డి, రెవరెండ్ జీవన్ కుమార్, ప్రసాద్ బాబు,కెజె ఫిలోమన్ హాజరవుతారని చెప్పారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఎఫ్‌పిఒలు బలోపేతం

గుమ్మలక్ష్మీపురం : రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బోలోపేతమై ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి టి.సురేందర్ అన్నారు. మండలంలోని గొరడ గ్రామంలో ఆదితల్లి రైతు ఉద్యాన ఉత్పత్తిదారుల ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ టి జమ్మయ్య అధ్యక్షతన సభ్యులు, డైరెక్టర్లు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్కెటింగ్ చేయడంపై సహకారం, అవగాహన కల్పించారు. రైతులు పంటలు పండించడం ఒక ఎత్తు అయితే ఆ పంటలను మార్కెట్ చేయడం మరో ఎత్తు అని అన్నారు. దళారుల వ్యవస్థ నిర్మూలన చేయాలంటే ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారులకు నేరుగా ఉత్పత్తులు అందినట్లయితే ప్రయోజనం ఉంటుందన్నారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు సంస్థ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని, రైతులకు సభ్యులకు ప్రయోజనం కలిగే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గిరిజన ప్రాంతంలో చిరుధాన్యాలు, పండ్లు, చింతపండు మార్కెట్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ

పాలకొండ రూరల్ : మండలంలోని చిన్నమంగళపురం, అన్నవరం గ్రామాల్లో గురువారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహించారు. నవంబర్ 15వ తేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు ప్రతిరోజు సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నవరం పిహెచ్ సి హెల్త్ సూపర్‌వైజర్ కిమిడి రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, లావుగా నొప్పితో కూడిన నరములు, చేతులు, పాదాలు తిమ్మిర్లు, నొప్పి తెలియని పుండ్లు, చేతులు, పాదాలపై ఉండడం తదితర లక్షణాల ద్వారా కుష్టి వ్యాధిని గుర్తించవచ్చు అన్నారు. ఎవరికైనా వ్యాధి సంక్రమించిన యెడల అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఈ వ్యాధి ద్వారా అంగవైకల్యం ఉన్నవారికి ప్రభుత్వం ద్వారా పింఛను ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెచ్‌వి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది